క్లుప్తంగా

ఓయూ నుంచి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న పీటర్

ఇల్లెందు: ఇల్లెందుకు చెందిన పాగోలు పీటర్ బెలిగ్రామ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. 'ఓరల్ కమ్యూనికేషన్ ఆంగ్జయిటీ ఏ స్టడీ ఆఫ్ హయ్యర్ సెకండరీ ట్రైబల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇంగ్లిష్ ఇన్ తెలంగాణ' అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఇల్లెందుకు పాగోలు రవికుమార్– జక్కిలిన్ కుమారుడైన పీటర్ డాక్టరేట్ అందుకోవడంపై పలువురు అభినందించారు.

బోడు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని బోడు, పరిసర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బోడు, కొప్పురాయి, రామచంద్రునిపేట, పరిసర ప్రాంతాల గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం పలువురు హైదరాబాద్‌లోని సచివాలయానికి వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డికి చేరేలా సంబంధిత అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇల్లెందు బస్ డిపో నుంచి టేకులపల్లి, బోడు, కొప్పురాయి, ఒడ్డుగూడెం వరకు ఒకటి, టేకులపల్లి, బోడు, రామచంద్రునిపేట, పాతర్లగడ్డ, రామకృష్ణాపురం, మర్రిగూడెం వరకు మరో రెండు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. బస్సు సౌకర్యం లేక స్థానిక గిరిజన ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి బస్సు సర్వీసు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

కొత్తగూడెంరూరల్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి తరుపున ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకుడు ఊకంటి గోపాల్‌రావును పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: సౌదీ అరేబియాలోని కింగ్ అబుల్ అజీజ్ విశ్వవిద్యాలయం 2024 విద్యా సంవత్సరానికి గాను మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వనుందని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో మాస్టర్ పీహెచ్‌డీ, డిగ్రీ ప్రోగ్రాం కోర్సులు చదువుకునేందుకు ఈ స్కాలర్‌షిప్‌లు ఉపయోగపడుతాయని, ఈనెల 28 తేదీన ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు విశ్వతేజ

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీకి చెందిన బత్తిని విశ్వతేజ బాస్కెట్ బాల్ అండర్–14 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైన విశ్వతేజ ఈనెల 9, 10, 11, 12 తేదీలలో హైదరాబాద్‌లోని కొంపెల్లిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనబోతున్నాడు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విశ్వతేజ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కోటి దీపోత్సవం



భక్తులు వెలిగించిన దీపాలు

పాల్వంచ: నవభారత్ ఎన్ఎండీసీ కాలనీలోని శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపోత్సవం నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలు వారి వివరాలతో ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచనలు చేశారని, ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు వారి ఇండియన్ ఇంటర్నేషనల్ పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, బ్యాంకు పాసుబుక్‌తో వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. 70 ఏళ్లు పైబడిన వారికి డ్రా ద్వారా కాకుండా నేరుగానే హజ్ యాత్రకు ఎంపిక చేస్తారని, మిగిలిన వారికి మాత్రం డ్రా ద్వారా ఎంపిక చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెట్టుబడి ఘనం.. దిగుబడి గగనం..

ఈ ఏడాది వరి రైతులకు అప్పులే దిగుబడులయ్యాయి. అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులకు రుణాలే మిగిలాయి. ఈ వానాకాలంలో సాగుకు సమయానుకూలంగా వరుణుడు కరుణించక ముఖం చాటేయడంతో వరి దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. పెట్టుబడి విషయంలో రాజీపడకుండా ముందుకు సాగిన రైతుకు తరిగిపోయిన దిగుబడుల వల్ల చి'వరి'కి నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చింది.

- దయనీయంగా వరి రైతుల పరిస్థితి
- ఎకరాకు 20 బస్తాలు వచ్చినా మహాభాగ్యమే
- చి'వరి'కి రైతు మూటగట్టుకుంది నష్టాలే..



హార్వెస్టర్‌తో వరి నూర్పిడి

ఇల్లెందురూరల్: గతం కంటే ప్రస్తుత వానాకాలంలో వరికి పెట్టుబడులు భారీగా పెరిగిపోయాయి. విత్తనాల కొనుగోలు నుంచి నీటితడులు, వరి కోతల వరకు పెట్టుబడులు పెరిగాయి. భూమి కౌలు ధరలు కూడా పెరిగాయి. ఒక రైతు ఎకరా విస్తీర్ణంలో వరి సాగు చేస్తే.. విత్తనం వ్యయం రూ.వెయ్యి, నారుమడి దున్నేందుకు రూ.500, ఆ తరువాత దుక్కి రెండు సాళ్లు దున్నేందుకు రూ.1,500, దమ్ము చేసేందుకు రూ.2,500, గొర్రుకు రూ.2వేలు, పారపనికి రూ.1,500, నాటు వేసేందుకు రూ.2వేలు, దమ్ములో మందు కట్టుకు రూ.1,200, మరోపారి మందుకట్టుకు రూ.1,200, కలుపు తీతకు రూ.2వేలు, ఆ తరువాత మందు కట్టుకు రూ.1,200, పై ముందుల (పురుగు మందు పిచికారీ) కోసం రూ.1,500 అవసరం. ఇంత పెట్టుబడి పెడితే గానీ వరి పొట్టదశకు చేరుతుంది. ఆ తరువాత వరి కోతలను ప్రస్తుతం యంత్రాల సహాయంతో చేపడుతున్నారు. ఎకరా వరి కోతకు యంత్రాలకు రూ.5వేలు చెల్లిస్తున్నారు. ఇలా మొత్తం ఖర్చు రూ.22 వేల నుంచి 23వేలకు చేరుతోంది. ఇంతేకాకుండా భూమి కౌలు ఎకరానికి పది బస్తాలు చెల్లించక తప్పడం లేదు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం కౌలుకు నగదులో రూ.16,522 చెల్లించాల్సి ఉంటుంది. కౌలు రైతు అయితే పెట్టుబడి వ్యయం ఎకరాకు రూ.39,522 వరకు ఉంటుంది.

తగ్గిన దిగుబడి...

ప్రస్తుత వానాకాలం ప్రారంభంలో వరికి వాతావరణం అనుకూలంగా ఉంది. చాలామంది రైతులు మొక్కజొన్న పంటను చెడగొట్టి మరీ వరి సాగు చేపట్టారు. పంట బాగా పెరుగుతుండటం, వర్షాలు అనుకూలంగా ఉండటంతో రైతులు ఆనందంగా వెనుకాడకుండా పెట్టుబడి పెట్టారు. కానీ పొట్ట దశలో కీలకమైన చివరి తడి అన్నదాతలను ఊపిరాడకుండా చేసింది. చెరువులలో నీరు అడుగంటడం, బోర్లు, బావులలో సైతం నీటి మట్టడం పూర్తిగా పడిపోవడం రైతులను ఇబ్బందులకు గురిచేసింది. చాలామంది రైతులు సుదూర ప్రాంతాల నుంచి మోటార్ల సహాయంతో నీటిని తరలించి పంటలను తడుపుకోవాల్సి వచ్చింది. దీనికోసం ఒక్కో రైతు ఎరకాకు రూ.4వేల వరకు ఖర్చు చేశారు. అయినా నిర్దేశించుకున్న విస్తీర్ణంలో సగం కూడా తడపలేకపోయారు. ఈ కారణంగా దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. సాధారణంగా వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 40 బస్తాల (32 క్వింటాళ్లు) వరకు పండుతుందని రైతులు పేర్కొంటున్నారు. కానీ ప్రస్తుత సీజన్‌లో మాత్రం ఎవరిని మందలించినా ఎకరాకు 16 బస్తాల నుంచి 20 బస్తాల వరకు పండినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇందులోనూ 5 బస్తాల వరకు తాలు కింద పోతోందని వాపోయారు. అంటే బాగా పండిన రైతుకు 15బస్తాలు మించలేదని అన్నదాతలు చెబుతున్నారు.

తుపాన్‌తో తీరని శోకం..

పెట్టుబడి భారమైనా దిగుబడి తగ్గే సూచనలు కనిపిస్తున్నా మొక్కవోని ధైర్యంతో వరికోతలకు సమాయత్తమైన రైతులకు తుపాన్ తీరని శోకం మిగిల్చింది. మండలంలో అత్యధిక విస్తీర్ణంలో వరికోతలు ప్రారంభం కాలేదు. తుఫాన్ ప్రభావంతో రెండు రోజులపాటు కురిసిన వర్షాలకు వరి పంట పూర్తిగా నేలవాలింది. చాలా వరకు మెదలు నీటిలో తడిశాయి. దీంతో దిగుబడి మరింత తగ్గడంతోపాటు గింజ నాణ్యత తగ్గి ధరపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు.

అన్నదాతకు భారీ నష్టం..

వరి పంట బాగా పండితే ఎకరాకు 30 క్వింటాళ్లకు మించి పండుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం ఎకరాకు రూ.2,203 చొప్పున 32 క్వింటాళ్లకు రూ.66వేలు ఆదాయం వస్తుంది. పెట్టుబడి రూ.23వేలు, కౌలు రూ.16,522 మొత్తం పెట్టుబడి రూ.39,522 పోను రైతుకు రూ.26వేలు వరకు ఆదాయం వస్తుంది. కానీ ప్రస్తుత పరిస్థితిలో దిగుబడి ఎకరాకు 15 బస్తాలు మించడం లేదు. ఖర్చు చూస్తే సాధారణ పెట్టుబడి 39,522లకు తోడు ఈసారి చివరి తడి కోసం చాలా మంది రైతులు ఎకరాకు రూ.4వేల వరకు అదనంగా ఖర్చు చేశారు. దీంతో పెట్టుబడి ఒక్కో రైతుకు రూ.44,522లకు చేరింది. కానీ పండింది మాత్రం 15 బస్తాలే. అంటే ఎకరాకు రైతుకు దక్కింది సుమారుగా 11.25 క్వింటాళ్లు. ఈ లెక్కన రైతు ఒక సీజన్‌లో శ్రమిస్తే వచ్చిన ఆదాయం రూ.24,783. అంటే రైతుకు ఎకరానికి మిగిలింది సుమారుగా రూ.20వేలు అప్పు. ఇక తుపాన్ ప్రభావానికి గురైన రైతులకు ఆ కాస్తా ఆదాయం కూడా ఉండే అవకాశం లేదని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

మూడెకరాల్లో రెండు క్వింటాళ్ల దిగుబడి..



మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఈ ఏడాది ప్రారంభం నుంచి పంట బాగా ఉండటంతో పెట్టుబడి విషయంలో రాజీ పడలేదు. చివరి తడికి నీరు అందకపోవడంతో ఎకరానికి రూ.4వేలు వెచ్చించి నీటిని తరలించాను. అయినా రెండు ఎకరాలు ఎండిపోయింది. ఎకరం పంట విక్రయిస్తే రూ.4వేలు వచ్చాయి. చివరకు రూ.70వేలు నష్టం వచ్చింది.

– గుగులోత్ లచ్చిరాం, వేపలగడ్డతండా

దిగుబడిలో సగం తాలే...



ఎకరం పది బస్తాల చొప్పున రెండు ఎకరాలు భూమి కౌలుకు తీసుకున్నాను. పొట్ట దశ వరకు ఆశాజనకంగా ఉంది. చివరి తడికి నీరందక పోవడంతో ఎకరానికి రూ.4వేలు చెల్లించి పొలం తడుపుకున్నాను. కానీ రెండు ఎకరాల్లో 26 బస్తాల దిగుబడి వచ్చింది. అందులో 11 బస్తాలు తాలే వచ్చింది. ఇక నాకు మిగిలింది కేవలం 15 బస్తాలు.

– ఏపె సీతారాములు, సుదిమళ్ల

'పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలం వల్లే ఓటమి'



మాట్లాడుతున్న మడత వెంకట్‌గౌడ్

ఇల్లెందు: తాజా ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలం కావడంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ ఓడిపోయారని ఆ పార్టీ నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ తెలిపారు. ఇల్లెందులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు రోజు నిర్వహించిన ర్యాలీకి వచ్చిన వారికి డబ్బులు ఇస్తానని ఇవ్వకపోగా, ఇదేమిటని ప్రశ్నిస్తే హరిప్రియ భర్త హరిసింగ్ చెప్పిన మాటలతో నేతలు ఆవేదనకు గురయ్యారని చెప్పారు. అభివృద్ధి విషయంలో హరిప్రియ విజయవంతమైనా ఆమె ఓటమికి హరిసింగ్ వ్యవహార శైలి కారణమన్నారు. కాగా, ఎమ్మెల్యేగా గెలిచిన కోరం కనకయ్యకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపిన ఆయన, ఆరు గ్యారంటీ స్కీంల అమలుకు కృషి చేయాలని కోరారు. మేకల మల్లేషయాదవ్, తులసీరాంగౌడ్, చంద్రమౌళి గౌడ్, స్వామినాయక్, రాజేందర్, అజయ్‌కుమార్, సతీష్ నాయుడు, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

టేకులపల్లి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కోట వీరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మెడికల్ షాపుల తనిఖీ



తనిఖీ చేస్తున్న డాక్టర్ రాకేష్ కుమార్

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని మెడికల్ షాపుల్లో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ షాపుల నిర్వహణ, ఫార్మసీ లైసెన్స్, రికార్డులు, డ్రగ్స్ నిల్వలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... గడువు తీరిన మందులు అమ్మరాదన్నారు. అదేవిధంగా ప్రిస్కిప్షన్ లేకుండా మందులు ఇవ్వొద్దని చెప్పారు. ఫార్మసీ లైసెన్స్‌ను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేయించుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

మూడు విప్లవ పార్టీలు విలీనం



మాట్లాడుతున్న ప్రజాపంథా నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, కార్పొరేట్, ఫాసిస్టు, ఆర్ఎస్ఎస్ బీజేపీలను ఓడించేందుకు మూడు విప్లవ పార్టీలను విలీనం చేయనున్నామని, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పీసీపీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎం ఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రెవెన్యూషనరీ ఇన్షియేటివ్ సంస్థల ఐక్యతా చర్చలు జనవరి–2023లో ప్రారంభం అయ్యాయని, వాటి కొనసాగింపుగా 2023 నవంబర్ 28, 29, 30 తేదీలలో కలకత్తాలో సమావేశమై ఐక్యతకు సంబంధించిన విధివిధానాలు ఖరారు చేశారని చెప్పారు. భారత విప్లవోద్యమానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను సమగ్రంగా చర్చించి సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ అంశాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ పంథా నిబంధనావళిని రూపొందించుకోవటం జరిగిందన్నారు. ప్రస్తుత నిర్దిష్టమైన పరిస్థితులతో మూడు సంస్థలు కలిసి ఓకే పార్టీగా భారత కమ్యూనిస్టుగా ఏర్పడాలని భావించామన్నారు. బిన్న ఆలోచనలను చర్చించుకొని ఐక్యత భారత విప్లవోద్యమ శక్తుల ఐక్యతకు మొదటి మెట్టు కావాలని ఆకాంక్షించారు. అఖిల భారత ఐక్యతా మహాసభ (యూనిట్ కాన్ఫరెన్స్) 2024 మార్చి 3, 4, 5వ, తేదీలలో ఖమ్మంలో నిర్వహించనున్నామని, ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభా ప్రాంగణానికి తమ అభిమాన నాయకులైన సంతోష్‌రాజా, రవన్నల పేర్లు పెట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి 14 రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరై పార్టీ కార్యక్రమం, పంథా నిబంధనావళి, రాజకీయ తీర్మానానికి సంబంధించిన డ్రాఫ్టును తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఐక్యతా సమావేశాలు విజయవంతం చేయటానికి వీలుగా పి.రంగారావు, 12 మంది సభ్యులుగల ఐక్యతా సమావేశాల నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయటం జరిగిందని వివరించారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ముద్ద భిక్షం మాచర్ల సత్యం, జాతోట్ కృష్ణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

వంటగ్యాస్ లీకై వస్తువులు దగ్ధం

చుంచుపల్లి: నందా తండా అంబేద్కర్ కాలనీకి చెందిన ఓ ఇంట్లో శుక్రవారం గ్యాస్ లీకై వస్తువులు దగ్ధమయ్యాయి. అంబేడ్కర్ కాలనీకి చెందిన శీలం మంగమ్మ ఇంట్లో వంట చేస్తూ బయటి వాళ్లతో ముచ్చటిస్తున్న సమయంలో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్న మంచంతో పాటు ఇతర వస్తువులు కాలిపోయాయి. ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలార్పారు.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఆవునూరి మధు

ఇల్లెందురూరల్: మిచాంగ్ తుపాన్ బాధిత రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. తుపాన్ ప్రభావంతో చేతికంది వచ్చిన పంట పూర్తిగా తడిసిపోయిందని, మిర్చి పంట నేలవాలి పనికిరాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల యాసంగి మొక్కజొన్న నేలవాలిందన్నారు. నీటిలో తడిసిన వరిగింజ రంగు మారి ధరపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం అన్ని మండలాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి మద్దతు ధర అందజేయాలని కోరారు. కూరగాయల పంటకు కేంద్రంగా ఉన్న ఇల్లెందు మండలంలో తుపాన్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, కూరగాయల రైతులకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు విత్తనాలు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణం క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా న్యూడెమోక్రసీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ముందుగా ఇల్లెందులో భారీ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరరావు, గొని నాగేశ్వరారవు, జోగ కాంతారావు పాల్గొన్నారు.

గుండెపోటుతో మృతి

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌లో కమర్షియల్ ఆఫీసర్‌గా విధులుగా నిర్వహిస్తున్న సతీష్(39) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విధుల్లో భాగంగా హైదరాబాద్‌లో జరుగుతున్న రెండు రోజుల ట్రెనింగ్‌కు వెళ్లిన సతీష్, ట్రెనింగ్‌లోనే తనకు కళ్లు తిరుగుతున్నాయని, తోటి సిబ్బందితో చెప్పి అక్కడికి అక్కడే కిందపడిపోయాడు. వారు వెంటనే సతీష్‌కు సీఆర్‌సీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. సతీష్ మృతి పట్ల బాడీసీఆర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థులు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



ఎన్నికైన కార్యవర్గంతో డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్ శిక్షణ తీసుకుని క్రమశిక్షణను అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. శుక్రవారం పాతకొత్తగూడెంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 2వ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. అనంతరం నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక డీఈఓ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో సౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరే విధంగా సౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు కృషి చేయాలన్నారు.

కార్యవర్గ ఎన్నికలో జిల్లా సెక్రెటరీగా ఎం.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ ఎస్.భారతమాత, కోశాధికారిగా వరలక్ష్మి, జిల్లా కమిషనర్‌గా ఆనంద్ కుమార్, ఉపాధ్యాక్షులుగా ఎస్.మాధవరావు, జిల్లా అదనపు కమిషనర్‌గా చలపతి, లక్ష్మీరెడ్డి, ట్రైనింగ్ కమిషనర్‌గా పీవీ రమణ, సమ్మయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీఈ జీసీడీఓ అలివేలు మంగతాయారు, జిల్లా అదనపు కోఆర్డినేటర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న ప్రభుదయాళ్

కొత్తగూడెంఅర్బన్: పాఠశాల స్థాయి విద్యారంగంలో విద్యార్థులే ముఖ్యమని, ప్రాథమిక దశలోనే వారి విద్యా పునాదులను పటిష్ట పరుస్తూ వారి అంతర్గత నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించేలా నిరంతర కృషి జరగాలని కొత్తగూడెం నోడల్ అధికారి డాక్టర్ ప్రభుదయాళ్ కోరారు. శుక్రవారం రామవరం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని విద్యాపరంగా పలు విషయాలపై మాట్లాడారు. పాఠశాల నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ సూచనలను విధిగా అమలు చేయాలన్నారు. గ్రంథాలయ పుస్తకాలను వినియోగించాలని, విద్యార్థి విద్యాపర సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తొలిమెట్టు, ఉన్నతి విద్యా కార్యక్రమాలను. పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. విద్యా రంగంలో విద్యార్థులే ముఖ్యులు కావున వారి అభ్యున్నతికై కృషి చేయాలని కోరారు. సమాజాభివృద్ధిలో విద్యే కీలకమని తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న శ్రీనివాస్

కొత్తగూడెంఅర్బన్/సింగరేణి(కొత్తగూడెం): మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని మానవ అక్రమ రవాణా నివారణ అధికారి శ్రీనివాస్ సూచించారు. రామవరం సుభాష్‌చంద్రబోస్ నగర్‌లోని మోడ్రన్ ఇఖ్రా స్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు పలకరించినా బదులు ఇవ్వొదని, ప్రలోభాలకు లొంగొద్దని తెలిపారు. కొందరు పిల్లలను ఎత్తుకెళ్లి అవిటి వాళ్లుగా మార్చి యాచించేందుకు ఉపయోగిస్తున్నట్లు సమాచారం ఉన్నందున తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. అలాగే, 18 ఏళ్లు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, ఆడపిల్లలు ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడితే షీ టీంకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, పాఠశాల కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్, హెచ్ఎం పర్వీన్ సుల్తానాతో పాటు లక్ష్మీప్రసన్న, రేష్మా, నీలా, సల్మా, నస్రత్‌ఖాజా, శిరసా తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు బంధు పథకం ద్వారా ప్రతీ కార్మికుడికి 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి, రూ.50 లక్షలు వడ్డీలేని రుణం ఇవ్వాలని ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి.మాధవనాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్పొరేట్ పరిధిలోని మెయిన్ వర్క్‌షాపులో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను తిరిగి రీయింబర్స్‌మెంట్ చేయాలని, 12వ వేతన సవరణ (జేబీసీసీఐ) బీఎంఎస్‌తోనే సాధ్యమన్నారు. 11వ వేతన కమిటీ జేబీసీసీఐ ఏర్పాటు కాదని, కొన్ని కార్మిక సంఘాల నాయకులు దుష్ప్రచారం చేస్తూ కార్మికులను బయాందోళనకు గురిచేస్తే బీఎంఎస్ కచ్చితంగా సాధిస్తామని చెప్పి ఎంతో ఓర్పుతో బీఎంఎస్ జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఇతర సంఘాలను కలుపుకొని సమ్మె లేకుండా, ఉత్పత్తి నష్టం లేకుండా, కార్మికులు వేతనం నష్టపోకుండా 19శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్ 25 శాతం అలవెన్స్‌పై పెరుగుదలతో చారిత్రాత్మకమైన ఒప్పందం సాధించామని సగర్వంగా చెబుతున్నామన్నారు. ఒప్పందంపై అధికారుల సంఘం కోర్టులో కేసు వేసి అడ్డుకునే ప్రయత్నాన్ని సమర్థవంతంగా నిలువరించామని తెలిపారు. రాబోయే 12వ వేతన సవరణ సకాలంలో ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అంతేకాక, సింగరేణి కార్మికులకు తాజా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మారుపేర్లతో ఉన్న కార్మికుల పేర్లు, ఆధార్ కార్డ్ ప్రకారం క్రమబద్ధీకరించాలని, అనేక పోరాటాలు, కార్మిక చైతన్య యాత్ర ద్వారా, బాయి నిద్ర, బస్తీబాట, జీఎం ఆఫీస్, హెడ్డాఫీస్ ఎదుట ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి కార్మికులను చైతన్య పరిచి యాజమాన్యంపై ఒత్తిడి చేసి కార్మికుల హక్కులు కాపాడుతూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కావున రాబోయే సింగరేణి కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్ కాగడా గుర్తుపై ఓటేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మొగిలిపాక రవి, ఊట్ల గణేష్, టి.నరేంద్రబాబు, సంఘం చందర్, బి.రాంసింగ్, మోహన్, అల్లి ప్రకాశ్‌రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాల నమోదు



జూలూరుపాడు: కరివారిగూడెంలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు



పాల్వంచ: తొగ్గూడెంలో పంట దెబ్బతిన్నదని చూపిస్తున్న మహిళా రైతు

జూలూరుపాడు: తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట నష్ట వివరాలను నమోదు చేస్తున్నట్లు జూలూరుపాడు ఏఓ ఎస్ రఘుదీపిక చెప్పారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలో తుపాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటను గుర్తించి, వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. మండలంలో నాలుగు క్లస్టర్ల పరిధిలో ఏఈఓలతో కలిసి పర్యటించి, దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పత్తి పంట కనీసం 33 శాతం పైగా దెబ్బతింటేనే వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మిరప పంట వివరాలు హార్టికల్చర్ వారు నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు బి.గోపీకృష్ణ, లావణ్య, సరిత, గౌస్, రైతులు పాల్గొన్నారు.

అధికారులూ దయచూపరూ!

పాల్వంచ: తుపాన్ కారణంగా మండలంలోని తొగ్గూడెం పంచాయతీలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరి పోలాలన్నీ నీట మునిగాయి. కోత దశలో ఉన్న పంట మొత్తం కిందకు వాలి దెబ్బతింది. దీంతో స్థానిక రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే రెండు రోజులుగా కనీసం అధికారులెవరూ పంచాయతీలో పంటలను సర్వే చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. తక్షణం దెబ్బతిన్న పంటలను సర్వే చేసి పంట నష్టంపై నివేదిక తయారు చేసి ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.